
# మనిషి

## కరీము



అవి నేను నకరెకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో మాథ్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రోజులు. పదేళ్ల క్రితంనాటి మాట. నేనక్కడ పనిచేస్తున్న రోజుల్లో తెనాలి ప్రాంతం అమృతలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నుండి శంకరం- లాంగ్ స్టాండింగ్ బదిలీపై మా స్కూలుకొచ్చాడు.

ఆ రోజు నాకు బాగా గుర్తు.

ఆ రోజు ఉదయం యథాలాపంగా క్లాసుకు వెళ్తున్న నాకు హెడ్మాష్టర్ గది ముందు తెల్లటి కుర్తా పైజామాలో చేతికి గూడ సంచి, కళ్లకు సన్నటి గుండ్రటి అద్దాలతో శంకరం తచ్చాడుతూ కన్పించాడు. శంకరాన్ని సమీపించి ఎవరూ? ఏమిటని అడిగాను.

అలా నాకు శంకరం తొలిసారి పరిచయమయ్యాడు.

ఏదో పని నిమిత్తం గ్రామ సర్పంచి ఇంటికి వెళ్లిన హెడ్మాష్టరు కోటంరాజు గారు రాగానే శంకరాన్ని ఆయనకు పరిచయం చేసి నేను క్లాసుకు వెళ్లిపోయాను.

ఆ రోజు మధ్యాహ్నం హెడ్మాష్టరు గారు ఒక సమావేశం ఏర్పాటు చేసారు. పిల్లలందర్ని ఇళ్లకు పంపించేసి మూడు గంటలకు స్టాఫ్‌రూంలో స్టాఫ్ అందరం సమావేశమయ్యాం.

కోటంరాజుగారు మా అందరికి శంకరాన్ని పరిచయం చేసారు. తర్వాత ఆయన మా పాఠశాల ఔన్నత్యం గురించి చెప్పారు. ప్రయివేటు ధాటికి సర్కారు పాఠశాలలు కుదేలవుతున్న ప్రస్తు త తరుణంలో ప్రయివేటుకు దీటుగా తాము సాధిస్తున్న ఫలితాలను

ఏకరువుపెట్టారు. గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో మా పాఠశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించిన విషయం చెబుతున్నప్పుడు ఆయన ముఖంలో నమ్రతతో కూడుకున్న గర్వం తొణికిసలాడింది.

హైస్కూళ్లలో ఉన్నన్ని రాజకీయాలు, గ్రూపులు దేశ రాజధానిలో కూడా ఉండవని ప్రతీతి. దానికి భిన్నంగా ఎలాంటి రాజకీయాలు, గ్రూపులు లేకుండా తామంతా ఎలా కలిసి ఉంటుంది చెప్పారాయన. చివరిగా శంకరం కూడా తమలో ఒక్కరిగా కలిసిపోవాలని కోరుకున్నారాయన.

నిజానికి మేమంతా అలా కలసి మెలసి ఉండటానికి కారణం ఆ కోటంరాజుగారి మంచితనం. పాఠశాల పట్ల ఆయనకున్న అంకితభావమే! ఇదే విషయాన్ని చెప్పాన్నేను.

అందరు మాట్లాడిం తర్వాత చివరగా శంకరాన్ని మాట్లాడవల్సిందిగా కోరాం. శంకరం కేవలం తన పేరు, తనెక్కడ్నుంచి వచ్చింది ముక్తసరిగా చెప్పి ముగించడంతో శంకరం గురించి తెల్సుకోవాలనుకున్న మాకు చిన్న నిరాశ కలిగింది. బహుశా కొత్త వల్ల మాట్లాడలేకపోయాడనుకున్నాం.

అందరు వెళ్లిపోయారు. నేను, శంకరం మాత్రమే మిగిలాం.

బైటకి వెళ్తున్న శంకరాన్ని పిలిచి ''ఎక్కడికి వెళ్తన్నారు.'' అని అడిగాను.

''ఊర్లోకి వెళ్లి అద్దెకు ఇల్లు వెతకాలి.'' అన్నాడు శంకరం.

ఊరు గురించి తెల్సిన వాడిగా ''పదండి. నేనూ వస్తా'' అని అన్నాను.

''మీకెందుకులెండి శ్రమ..'' అన్నాడు శంకరం. నేనింటికి వెళ్లిపోయాను.

''అద్దెకు ఇల్లు దొరికిందా?''

మరుసటిరోజు స్టాఫ్‌రూంలో కనబడ్డ శంకరాన్ని అడిగాను. శివాలయం వీధిలో శేషాచలంగారింట్లో ఇల్లు దొరికిందని చెప్పాడు శంకరం. శేషాచలంగారు నాకు చాలా కాలంగా తెలుసు.

ఫామిలీని తీసుకు వచ్చే నిమిత్తం శంకరం రెండ్రోజులు శలవుపెట్టి అమృతలూరు వెళ్లాడు.

రెండ్రోజుల తర్వాత స్కూలుకొచ్చిన శంకరాన్ని ''ఫామ్లీని తీసుకు వచ్చారా?'' అని అడిగాను. తెచ్చాననన్నట్లు తలూపాడు శంకరం.

శంకరం ఫామిలి గురించి అడిగాను . తనకు పిల్లలు లేరని, ఇంట్లో ఉండేది తను, తన భార్యేనని చెప్పాడు.

శంకరం సమాధానానికి కాస్తంత ఆశ్చర్యమేసింది.

ఫామిలీ వివరాలు అడిగితే ఎవరైనా భార్యాపిల్లల గురించి, తల్లిదండ్రుల గురించి, తోడబుట్టిన వాళ్లగురించి ఇలా విపులంగా చెప్తారు. శంకరం మాత్రం లఘు ప్రశ్నకు సమాధానంలా ఒక్క ముక్కలో చెప్పడం చిత్రంగా తోచింది.

శంకరాన్ని ఇంకేమి వివరాలడక్కుండా వీలు చూసుకుని మీ శ్రీమతిని తీసుకు మా ఇంటికి రండని ఆహ్వానించాను.

దానికి శంకరం ఇబ్బందికరంగా ముఖం పెట్టి నా ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించాడు.

ఈసారి మాత్రం శంకరం మీద చిర్రెత్తుకొచ్చింది.

ఇంటికి రాకపోతే రాకపోయాడు. కనీసం మొహమాటానికైనా వస్తానని చెప్పొచ్చు కదా! వస్తానని చెప్పి ఆనక రాకపోతే నేనేమైనా అనుకుంటానా? అలా అనుకోవటానికి ఈయనేమన్న నా చుట్టమా? అసలు ఈ మనిషి జన బాహుళ్యంలో కలిసే ఘటమేనా?

మొదటిసారి నాకు శంకరం ప్రవర్తన పై నాకు సందేహం కలిగింది.

కాలం గడిచేకొద్దీ శంకరంలో ఎలాంటి మార్పు రాకపోగా మరింత అంతర్ముఖంగా ప్రవర్తించడంలో నా సందేహం నిజమన్పించింది. శంకరం స్కూల్లో ఎవరితో కలిసేవాడు కాడు. టచ్‌మినాట్‌లా వుండేవాడు. అవసరమొచ్చి మేమే మాట్లాడితే తప్ప తనకు తానుగా ఎవ్వరితో మాట్లాడేవాడు కాడు. తన క్లాసేంటో, తన పనేంటో. అంతే.

దాంతో శంకరం ప్రవర్తన నాకు కాకుండా మిగిలిన స్టాఫ్‌కు కూడా చిరాకు కలిగించేది. ఇలాంటి వాడు వచ్చాడేంటని అందరం అనుకునేవాళ్లం.

మానవ సంబంధాల మీద నాకు అపారమైన నమ్మకం. అది పరస్పరం భావాలు పంచుకోవడంతో ఏర్పడి ఇచ్చి పుచ్చుకోవడంతో మనుషుల మధ్య బలంగా పెనవేసుకుపోతాయి. ఇప్పుడు మనకు కన్పిస్తున్న ఈ సమాజ సౌథం పటిష్టమైన మానవ సంబంధాలనే, పునాదుల మీద నిలిచి ఉంది. ఒక్కరికోసం పదుగురు, పదుగురి కోసం ఒక్కరిగా బతకాలి. అలా కాక ఎవరికివారు అన్నట్లు ఉంటే మానవసమాజ పరిణామం తొలి దశలోనే ఆగిపోయి ఉండేది.

శంకరం నా ఆహ్వానాన్ని తిరస్కరించటాన్ని నేను అవమానంగా ఫీలయ్యాను. అప్పట్నుండి శంకరం అంటే నాలో ఒక విధమైన కోపం, అసహ్యం కలిగాయి. దాంతో స్టాఫ్ అందరిలో శంకరాన్ని చులకన చేసి మాట్లాడేవాణ్ణి. శంకరం మీద జోకులు పేల్చి అందర్ని నవ్వించేవాణ్ణి.

మొదట్లో శంకరం పరోక్షంలో హేళనగా మాట్లాడినా శంకరం నుండి ఎలాంటి ప్రతిచర్య లేకపోయేసరికి రాన్రాను అతని సమక్షంలోనే చులకనగా మాట్లాడేవాణ్ణి.

అలా శంకరం మా అందరికి నవ్వుకోడానికి ఒక టాపిక్‌లా మారిపోయాడు.

స్కూల్లో ఉదయం పూట ఇంటర్వెల్‌లో స్టాఫ్ అందరం టీ తెప్పించుకుని తాగుతాం. టీ ఖర్చును ప్రతినెల జీతాలప్పుడు అందరం ఇచ్చేవాళ్లం. ఒక రోజు శంకరానికి కూడా మేం టీ ఆఫర్ చేసాం.

వద్దన్నాడు. ఆ శాల్తీ నుండి ఈ సమాధానాన్ని ముందే ఊహించాం. కొంచెం ఆట పట్టించాలన్న ఉద్దేశ్యంతో 'ఏం! టీ అలవాటు లేదా?' అనడిగాం.


అందుకు శంకరం చెప్పిన సమాధానమేమిటో తెలుసా?

''ఇంటిదగ్గర తాగొస్తాను. బైట అనవసరపు ఖర్చు.'' అన్నాడు. బిత్తర పోవడం మా వంతయ్యింది.

పిల్లలు పుట్టకముందే టీ అనవసరపు ఖర్చంటున్నాడు. ఇక పిల్లలు పుడితే భోంచేయడం కూడా అనవసరపు ఖర్చంటాడేమో? ఈయన గారికి గాలి పీల్చడం మినహా మరో అలవాటున్నట్లు లేదు. ప్రకృతిలో గాలి ఫ్రీగా దొరకబట్టిగాని లేకపోతే అనవసరపు ఖర్చని శ్వాసలు కూడా లెక్కప్రకారం తీసుకునేవాడేమో! అందరం నవ్వుకున్నాం.

అప్పట్నుండి శంకరానికి ఒక నిక్‌నేమ్ తగిలించాం. పి.శం. అని. అంటే పినాసి శంకరం అన్నమాట. అందరం శంకరాన్ని పిశంగాడు అని పిల్చేవాళ్లం.

ఒకరోజు నాకెలాంటి పీరియడ్ లేకపోవడంతో స్టాఫ్‌రూంలో ఒక్కణ్నే ఉన్న నాకు శంకరం డెస్క్ తెరిచి ఉండటం కన్పించింది. ఎవరూ లేకపోవడంతో సంస్కారాన్ని మరిచి డెస్క్ తెరిచి చూసాను. ఏదో కొన్ని క్లాసు పుస్తకాలు వాటి మధ్య ఫోటో ఒకటి కన్పించింది. అది శంకరం పెళ్లినాటి ఫోటో. ఫోటోలో శంకరం భార్య కుందనపు బొమ్మలా ఉంది. రహస్యంగా ఫోటోను స్టాఫ్ అందరికి చూడ



మని పాస్ చేసాను. మొరటోడికి మొగిలిపువ్వులా ఈ పినాసి ముఖానికి చక్కని చుక్కలాంటి భార్య అని అందరూ నవ్వుకున్నారు. ఎలాంటి స్పందనలు లేని జడపదార్థంతో ఆ మహాతల్లి సంసారమెలా చేస్తుందోనని నవ్వుకున్నాం.

ఈ నేపథ్యంలో ఒకరోజు పెద్ద బజారులో శేషాచలం గారు కన్పించారు. ఆయన్తో ఆమాటా ఈమాటా మాట్లాడిం తర్వాత శంకరం గురించి అడిగాను. శంకరం గురించి శేషాచలం గారు చెప్పిన మాటలకు నివ్వెరబోయాన్నేను.

'ఆయనేం మనిషండి బాబు? ఎవ్వరితో మాట్లాడడు. భార్య మీద చచ్చేంత అనుమానం. చిలుకను పంజరంలో బంధించినట్టు ఆ అమ్మాయిని ఇంట్లో పెట్టి తాళం వేసి స్కూలుకు వెళ్తాడు. సాయంత్రం స్కూలునుంచి వచ్చాక, ఇంట్లోకి వెళ్లి తలుపులు బిడాయించుకుంటాడు. అలా వెళ్లినవాడు మళ్ళీ బైటికి వచ్చేది ఉదయం స్కూలుకు వెళ్లేటప్పుడే. ఒఠ్ఠి శాడిస్టు. ఆ పిల్లను చావచితక్కొడతాడు. ఆ దెబ్బలకు తాళలేక పెద్దపెట్టున ఏడుస్తుంది. ప్రతినెల మొదటి తారీఖున అద్దె డబ్బులివ్వటానికి వచ్చి 'అద్దె డబ్బులండి' అంటూ మాట్లాడిన ఒక్క మాటే- అతగాడు మాట్టాడగా నేను విన్న మాట!'

మరుసటిరోజు స్టాఫ్ అందరికి శంకరం శాడిజం గురించి చెప్పాను. అందరు బిత్తరపోయారు. భార్యను అనుమానంతో హింసిస్తాడన్న విషయం తెలియడంతో మహిళా టీచర్లు శంకరాన్ని అసహ్యించుకున్నారు.

లోపల ఒక యువతి తన ఒంటిమీద చీర ఉందో, జారిపోయిందోనన్న స్పృహ లేకుండా శంకరాన్ని చేతుల్తో హిస్టీరియా రోగిలా దబదబమని కొడుతోంది. ఆ దెబ్బల్ని తింటూనే చేతిలోని అన్నంపళ్లెం పడిపోకుండా విశ్వప్రయత్నం చేస్తున్నాడు శంకరం.

నాకు మాత్రం శంకరం వ్యక్తిగత జీవితం గురించి తెల్సుకోవాలన్న పట్టుదల కలిగింది. ఎవరితో కలవకుండా, ఎవరికీ తెలియకుండా గోప్యంగా జీవిస్తున్నాడంటే ఏదో బలమైన కారణం ఉండాలి. ఎలాగైనా సరే ఆ కారణమేంటో కనుక్కోవాలనుకున్నాను.

ఇలా ఉండగా ఒకనాటి సాయంత్రం జరిగిన ఒక సంఘటన నన్ను బలంగా కుదిపేసింది. భూకంపంలా నన్ను కదలించేసింది.

మరుసటి రోజు స్కూలుకు వెళ్లానన్నమాటేగాని అన్యమనస్కంగా ఉన్నాను. ఎప్పుడు గలగల మాట్లాడే నేను మౌనంగా ఉండడం గమనించి అందరు ఏమైందని అడిగారు. నేనేం మాట్లాడలేదు.

ఆ రోజు శంకరం స్కూలుకు రాలేదు.

''ఏమిటి శేఖరం గారు పిశంగాడు రాలేదని బెంగెట్టుకున్నారా?'' నవ్వుతూ అన్నారందరు.

నా కంఠం రుద్ధం కాగా ''ప్లీజ్! శంకరాన్నేమి అనకండి'' అన్నాను.

అందరూ నావైపు వింతగా చూసారు.

''అవును. దయచేసి శంకరాన్నేమి అనకండి.'' మళ్ళీ అన్నాను.

చీమ చిటుక్కుమంటే వినబడేంత నిశ్శబ్దం అలుముకుంది.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఉద్వేగంగా మాట్లాడాను.

''ఇతరుల వ్యక్తిగత జీవితాల పట్ల మనకు ఎనలేని ఆసక్తి. అవతలి వ్యక్తులు వాటిని ఎంత గోప్యంగా ఉంచాలనుకుంటారో అంతకు రెట్టింపు ఆసక్తితో తెలుసుకోవాలనుకుంటాం. ఎలాగైనా వాళ్ల వ్యక్తిగత జీవితాన్ని, వాటి తాలూకు నిజాల్ని తెలుసుకుని నలుగురికి బహిర్గతం చేసే దాకా నిద్రపోం. అది కుసంస్కారం. అలాంటి వారిని కుసంస్కారులు అంటారు. అలాంటి సంస్కారహీనుల్లో నేనూ ఒకణ్ని.''

అందరూ ఆసక్తితో వింటున్నారు. నేను చెబుతున్నాను.

''నిన్న సంజెవేళ చిన్న పనిమీద శేషాచలం గారింటికెళ్లాను. పని ముగించుకుని వస్తున్న నాకు పక్కనే ఉంటున్న శంకరం ఇంట్లోంచి పెద్దగా దెబ్బలు కొడుతున్న శబ్దం, స్త్రీ ఏడుపు విన్పించాయి. ఏం జరుగుతుందో నేనూహించగలిగాను. ఆ పరిసరాల్లో ఎవరు లేకపోవడం గమనించి కిటికీలోంచి లోపలికి తొంగిచూసాను. లోపలి దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడనయ్యాను. ఒక్కక్షణం క్రితం నేనూహించిన దృశ్యం తాలూకు పాత్రలు వాస్తవంలో తారుమారయ్యాయి.

లోపల ఒక యువతి తన ఒంటిమీద చీర ఉందో, జారిపోయిందోనన్న స్పృహ లేకుండా శంకరాన్ని చేతుల్తో హిస్టీరియా రోగిలా దబదబమని కొడుతోంది. ఆ దెబ్బల్ని తింటూనే చేతిలోని అన్నంపళ్లెం పడిపోకుండా విశ్వప్రయత్నం చేస్తున్నాడు శంకరం.

ఆ యువతిని పోల్చుకోగలిగాను. ఆ యువతి శంకరం భార్య.

ఆమెకు అన్నం తినిపించబోయాడు శంకరం. అంతే. చేత్తో పళ్ళాన్ని బలంగా కొట్టింది ఆమె. ఆ దెబ్బకు పళ్లెం అంతెత్తు ఎగిరి కిందపడి పెద్ద శబ్దం చేసింది. అన్నం మెతుకులు గదంతా చిందర వందరగా పడ్డాయి.

కిటికీలోంచి ఆ దృశ్యాన్ని చూస్తున్న నేను కొయ్యబారిపోయాను.

ఇంతలో బైట ఏదో అలికిడవడంతో బైటి కొచ్చిన శంకరం కిటికీ దగ్గరున్న నన్ను చూసాడు.

''ఏమిటి శేఖరంగారు మీరిక్కడ?'' అంటూ ఆశ్చర్యంగా అడిగాడు శంకరం.

నేను సిగ్గుతో చితికిపోయాను.

'రండంటూ' ఇంట్లోకి పిలిచాడు శంకరం.

శంకరం భార్య అక్కడున్న వస్తువులన్నింటిని చిందరవందరగా పడేస్తోంది. శంకరం ఆమెను వేరే గదిలోకి తీసుకెళ్లి తలుపు గడియపెట్టాడు.

నేను షాక్ తిన్నట్టు చూస్తున్నాను.

ఇదంతా తనకు రోజూ మామూలేనని కూల్‌గా చెప్పాడు శంకరం. మిగిలింది నేనేం అడక్కుండానే చెప్పుకొచ్చాడు.

ఆమె నాభార్య. పేరు పద్మ. నా జీవితం, సర్వస్వం అంతా పద్మే. మా పెద్దవాళ్లు అజ్ఞానంతో చేసిన తప్పిదం పద్మపాలిట శాపం అయింది. మేనరికపు వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలకు పద్మ ఒక సాక్ష్యం. మా అమ్మ మా అక్కయ్యను తన ఒక్కగానొక్క తమ్ముడికిచ్చి పెళ్లి చేసింది. వాళ్లకు పద్మ పుట్టింది. పుట్టడమే మనో వైకల్యంతో పుట్టింది. దాంతో శారీరకంగా ఎదిగినప్పటికీ మానసికమైన ఎదుగుదల లేక చిన్నపిల్లలా ప్రవర్తించేది. ఒక యాక్సిడెంట్‌లో మా అక్కయ్య, మామయ్య చనిపోయారు. అప్పట్నుంచి పద్మ ఆలనా పాలనా మేమే చూసుకున్నాం. కాలంతోపాటు శారీరకంగా ఎదుగుతున్న పద్మను ఏం చేయాలో తెలీలేదు. ఆ దిగులుతోటే అమ్మ కాలం చేసింది. ఇక పద్మ బాధ్యత పూర్తిగా నామీద పడింది. మరో నిర్ణయానికి తావులేకుండా బంధువులు వారిస్తున్నా వినకుండా పద్మను పెళ్లిచేసుకున్నాను.

పద్మలాంటి మరో జీవిని ఈ లోకంలోకి తేవడం ఇష్టంలేక పిల్లల్ని వద్దనుకున్నాను. నా జీవితంలోని ఈ విషాదం తెలిస్తే అందరూ నామీద ఎక్కడ సానుభూతి చూపిస్తారోనని భయంతోనే ఇలా గోప్యంగా జీవిస్తున్నాను. ఎంతటి విషాదాన్నైనా భరించవచ్చు గాని సానుభూతిని భరించడం కష్టం.

మీరందరూ నాకు భార్య మీద అనుమానం అని అనుకున్నారు. పద్మను నేనలా ఇంట్లో వుంచి తాళం పెట్టిపోకపోతే ఎటన్నా వెళ్లిపోతుంది. ఒకసారి అలా వెళ్లిపోయింది కూడా. పిశం గాడు అని మీరు నన్ను హేళనగా మాట్లాడినా నాకేం బాధ లేదు. నాకొచ్చే జీతంతో కొద్దిపాటి తింటానికి మినహాయించి ప్రతి పైసా పద్మ వైద్యానికే ఖర్చుపెడుతున్నాను. టీ తాగడం నాకు అదనపు ఖర్చు అవుతుంది.

ఇన్నాళ్లు ఈ విషయం గోప్యంగా ఉంచగలిగాను. ఇప్పుడు మీకు తెలిసింది. దయచేసి మీరు నాపట్ల ఎలాంటి సానుభూతి చూపించకపోతే నేను మీకు కృతజ్ఞుడనై వుంటాను.

కత్తుల్తో గుండెను ముక్కలు ముక్కలుగా కోస్తే కలిగే బాధ ఏమిటో నాకాక్షణంలో అనుభవానికొచ్చింది. శంకరం మాటలు శూలాల్లా నా శరీరాన్ని తూట్లు తూట్లు చేసాయి. నామీద నాకు అసహ్యం కలిగింది. నేనసలు మనిషినేనా? అన్పించింది.

మనిషి అన్న మాటకు నిలువెత్తు అర్థంలా, విశ్వరూపంలా కన్పిస్తున్న శంకరం ముందు నేను పిపీలికాన్నయ్యాను.

చెప్పడం ఆపాను. అందరు దాదాపు ఫ్రీజ్ అయినట్టు నావైపే చూస్తున్నారు.

బెల్ మోగడంతో తేరుకుని అందరు భారంగా నడుచుకుంటూ క్లాసులకు వెళ్లిపోయారు.

శంకరానికి నా మొహాన్ని చూపిస్తు ఆ స్కూల్లో ఎక్కువ కాలం పనిచేయలేకపోయాను. ఆ మరుసటి సంవత్సరం కౌన్సిలింగ్‌లో బదలీ పెట్టుకుని అక్కడ్నుంచి వెళ్లిపోయాను. ★